
సాక్షి
ఆదిలాబాద్
బుధవారం ౹ 11 ౹ జనవరి ౹ 2023



ఆదివాసీల ఆత్మబంధువులు!
ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపి ఆత్మ బంధువులయ్యారు..స్వాతంత్ర్యానికి పూర్వమే 1.60లక్షల ఎకరాల భూమి పంపిణీచేసి గిరి పుత్రుల గుండెల్లో కొలువయ్యారు. 8లో▸

ఒకరికి కోవిడ్



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మంగళవారం ఒక కోవిడ్ కేసు నమోదైంది. ఆదిలాబాద్‌రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన 60 ఏళ్ల మహిళకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఒక యాక్టివ్ కేసు ఉంది.

గరిష్టం/కనిష్టం
29.0/11.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగ మంచుతో పాటు రాత్రివేళలో చలిప్రభావం కొనసాగనుంది.

న్యూస్‌రీల్

బీజేపీ లోక్‌సభ ప్రభారీల నియామకం



అల్జాపూర్ శ్రీనివాస్

సాక్షి,ఆదిలాబాద్/మంచిర్యాలటౌన్: బీజేపీ లోక్‌సభ నియోజకవర్గాల ప్రభారీలను నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభ నియోజకవర్గాల కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లనూ నియమించారు. ఆదిలాబాద్ లోక్‌సభ ప్రభారిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన అల్జాపూర్ శ్రీనివాస్, కన్వీనర్‌గా నిర్మల్ జిల్లాకు చెందిన అయ్యన్నగారి భూమన్న, జాయింట్ కన్వీనర్లుగా ఆసిఫాబాద్‌కు చెందిన కోలిపాక కిరణ్‌కుమార్, ఆదిలాబాద్‌కు చెందిన మయూర్‌చంద్రలను నియమించారు. పెద్దపల్లి లోక్‌సభ ప్రభారిగా న్యాయవాది అక్నాపురం విష్ణువర్ధన్‌రెడ్డి, కన్వీనర్‌గా పుదిల్ల మల్లికార్జున్, జాయింట్ కన్వీనర్‌గా ఎస్.వెంకటేష్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

'పుర ప్రజావాణి'కి 27 అర్జీలు



సమస్యలు వింటున్న కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన పుర ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 27 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించినవే 11 ఉన్నట్లు తెలిపారు. కమిషనర్ ఎ.శైలజ అర్జీలు స్వీకరించి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా ఆక్రమణల తొలగింపుపై 3, అనుమతి లేని కట్టడాలపై ఒకటి, రోడ్డు ఆక్రమణపై 1, మ్యుటేషన్, అసెస్‌మెంట్ 3, కొత్త వీధి దీపాలపై 1, ఇతర సమస్యలపై ఏడు అర్జీలు అందాయి. గత వారం అందిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లుగా కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, డీఈ తిరుపతి, ఆర్వోలు నితిన్, జాదవ్‌కృష్ణ, సిస్టమ్ ఇన్‌చార్జి రవీందర్ పాల్గొన్నారు.

పోర్టుపోలియో జడ్జిగా ఎం.సుధీర్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పోర్టు పోలియో జడ్జిగా ఎం.సుధీర్‌కుమార్‌ను నియమిస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు ఆదిలాబాద్ పోర్టుపోలియో జడ్జిగా శ్రీదేవి ఉన్నారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు విడుదల చేశారు.

నేడు సబ్ జూనియర్ హాకీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో బాలుర సబ్ జూనియర్ హాకీ ఎంపిక పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బర్త్ సర్టిఫికెట్, స్కూల్ బోనఫైడ్ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11గంటల లోపు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. వివరాలకు కోచ్ శ్రీనివాస్‌ను 7013854596 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్పీకి అభినందనల వెల్లువ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా భద్రతలో దేశంలో 5వ స్థానం, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంపై పలు పార్టీల నాయకులతో పాటు పలు సంఘాల సభ్యులు మంగళవారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. మెమొంటోలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మోసిన్ పటేల్, జిల్లా టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి శౌకత్ హుస్సేన్, కోశాధికారి సుభాష్ ఉరాడే, ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా, అబుబక్కర్ బిన్ ఆఫీస్, బారడీ రాకేష్, సాదిఖ్ అలి, అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్బాత్‌ఖాన్ తదితరులున్నారు.

యువజనోత్సవానికి తరలిరండి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని యువజన శిక్షణ కేంద్రంలో ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో శిక్షణ పొందు తు న్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానంతో పాటు గతంలో శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రక్తదాన శిబిరం ఉంటుందని, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



ఆదిలాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయం

ఆర్‌అండ్‌బీ.. పునర్‌వ్యవస్థీకరణ

- మొదలైన ప్రక్రియ
- నిరంతర పర్యవేక్షణే లక్ష్యం
- కొత్త పోస్టుల సృష్టికి ఆదేశాలు
- మంచిర్యాల కేంద్రంగా మరో 'సర్కిల్'
- ఉమ్మడి జిల్లాలో పలు సబ్‌డివిజన్ ఆఫీసుల పెంపు కూడా

సాక్షి,ఆదిలాబాద్: రోడ్లు, భవనాల శాఖలో పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ మొదలైంది. నిరంతర పర్యవేక్షణ, నిర్వహణ చేపట్టే విధంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో వందలాది పోస్టులను ఈ శాఖలో సృష్టిస్తుండగా,మరికొన్ని పోస్టులను రద్దు చేస్తూ ఇటీవలే ప్రభుత్వం నుంచి జీవో జారీ అయింది. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించి ఆదిలాబాద్ సర్కిల్‌గా సూపరింటెండింగ్ ఇంజినీర్(ఎస్‌ఈ), నాలుగు జిల్లాలను డివిజన్‌లుగా విభజించి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)ల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. రీఆర్గనైజేషన్‌లో మార్పులు జరగనున్నాయి.

మంచిర్యాల సర్కిల్ కేంద్రం..
ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ డివిజన్‌లు ఉన్నాయి. వీటి కింద ఆదిలాబాద్, ఉట్నూర్, బోథ్, నిర్మల్, భైంసా, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల సబ్ డివిజన్‌లు కొనసాగుతున్నాయి. పునర్ వ్యవస్థీకరణలో మరో సర్కిల్ ఏర్పడనుంది. మంచిర్యాల కేంద్రంగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. తద్వారా బాధ్యతల వికేంద్రీకరణ జరగనుంది. మంచిర్యాల సర్కిల్ కింద మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ సర్కిల్ కింద ఆదిలాబాద్, నిర్మల్ ఉండే అవకాశాలు ఉన్నాయి.

పీఆర్‌లోనూ..
పంచాయతీరాజ్ శాఖలోనూ పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించింది. అయితే దానిపై ఇంకా కదలిక మొదలు కాలేదు. ప్రస్తుతం ఆదిలాబాద్ కేంద్రంగా పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయం ఉంది. దీనికింద నాలుగు జిల్లాలు డివిజన్‌లుగా, వాటి కింద సుమారు 20 వరకు సబ్‌డివిజన్‌లున్నాయి. దీంట్లోనూ ప్రభుత్వం మార్పులు చేర్పులు చేపడుతుందా అనేది ఇప్పటివరకు స్పష్టత రాలేదు.

సబ్ డివిజన్‌ల పెంపునకు అవకాశం..
గతేడాది నవంబర్ 17న ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలతో హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల పర్యవేక్షణ, మరమ్మతులు నిరంతరం జరిగే విధంగా శాఖలో వికేంద్రీకరణ జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే పునర్ వ్యవస్థీకరణ చేపట్టాలని ఆదేశాలిచ్చారు. వానలు, వరదలతో పాడైన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని అప్పట్లో ఆదేశించారు. రోడ్లు చెక్కుచెదరకుండా అద్దాల్లా ఉండేందుకు నిరంతరం పర్యవేక్షణ, నిర్వహణ చేపట్టాల్సిన బాధ్యత ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలదేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. డివిజన్ల కింద మరో ఐదు సబ్‌డివిజన్లు పెరగనున్నట్లు తెలుస్తోంది. అలాగే సబ్ డివిజన్ కార్యాలయాల్లో సెక్షన్ల సంఖ్యను మరో 5 నుంచి 8 వరకు పెంచనున్నట్లు సమాచారం.

ఉత్తర్వులు వస్తేనే స్పష్టత



ఆర్‌అండ్‌బీలో పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి తుది ఉత్తర్వులు వస్తేనే మార్పులు చేర్పులు ఎలా ఉంటాయనేది తెలుస్తుంది. అప్పటివరకు ఏమి చెప్పలేం. ప్రధానంగా రోడ్ల నిర్వహణ, మరమ్మతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. – రాజేందర్ నాయక్, ఎస్‌ఈ, ఆర్‌అండ్‌బీ, ఆదిలాబాద్

ఏటీఎంలకు భద్రతేది?

- రెండేళ్ల క్రితం కలెక్టరేట్ చౌక్ పక్కన గల ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌ను దుండగులు వాహనానికి తాడు కట్టి సినీ ఫక్కీలో ఎత్తుకెళ్లిన విషయం విదితమే. బట్టిసావర్గాం ప్రాంతంలో మిషన్‌ను వదిలేసి వారు డబ్బుతో పరారయ్యారు. ఇందులో రూ.2లక్షలకు పైగా నగదు ఉన్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఆ సొత్తు రికవరీకి నోచుకోకపోగా కనీసం దుండగులను గుర్తించకపోవడం గమనార్హం.



గడ్డపారతో ఏటీఎంను పగులగొడుతున్న దుండగుడు

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌ను ఆదివారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో చోరీకి యత్నించారు. తలుపులు పగలగొట్టేందుకు యత్నించగా.. సైరన్ మోగింది. అప్రమత్తమైన బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. దుండగుడు వెంటనే పరారయ్యాడు. అంతకుముందు పట్టణంలోని టీఎన్‌జీవో భవన్ ఎదుట చోరీ చేసిన ఓ బైక్‌తో అతడు ఏటీఎం వద్దకు వచ్చినట్లు తెలుస్తోంది.

- నిఘా నేత్రాలున్నా.. తప్పించుకుంటున్న దుండగులు
- గతంలోనూ పలు ఘటనలు
- పోలీసు గస్తీ ఉన్నా.. ఆగని చోరీలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఏటీఎం సెంటర్లకు భద్రత కరువైంది. గార్డులు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఏకంగా మిషన్లనే ఎత్తుకెళ్లిన ఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా సంబంధిత బ్యాంకు అధికారులు గాని పోలీసులు గాని వీటి భద్రతపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. రెండేళ్ల క్రితం టూటౌన్ పక్కనే ఉన్న ఏటీఎం మిషన్‌ను ఎత్తుకెళ్లడం సంచలనం కలిగించింది. ఆ తర్వాత కూడా పలుసార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ముందర గల ఏటీఎంలో చోరీకి యత్నం జరిగింది. సైరన్ మోగడంతో దొంగలు పరారయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. తాళం వేసిన ఇళ్లు, ఏటీఎంలు, షాపులు, ద్విచక్ర వాహనాలను దుండగులు ఎత్తుకెళ్తున్నారు. ఇంటి ముందర, ఏటీఎంలలో, గల్లీలు, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా చోరీలు మాత్రం ఆగడం లేదు. బస్టాండ్, రైల్వేస్టేషన్, రిమ్స్ ఆస్పత్రిలో ద్విచక్ర వాహనాల చోరీలు అధికమయ్యాయి. ఆదివారం రాత్రి జరిగిన ఏటీఎం చోరీ విషయమై బ్యాంక్ సిబ్బంది వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆగని చోరీలు..
జిల్లాలో గతేడాది 173 ఆర్థిక నేరాలు చోటు చేసుకున్నాయి. రూ.1 కోటి 7లక్షల 90వేల 635 సొత్తు చోరీకి గురికాగా, రూ.57లక్షల 61వేల 935 నగదును పోలీసులు రికవరీ చేశారు. ఇక ద్విచక్ర వాహనాలు తరచూ చోరీలకు గురవుతున్నాయి. పార్కింగ్ చేసి వివిధ పనులపై వెళ్లి తిరిగి వచ్చే సరికి మాయం అవుతున్నాయి. మహారాష్ట్రకు చెందిన పలువురు ఈ చోరీలకు పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. రిమ్స్ ఆస్పత్రిలో గార్డులు ఉన్నప్పటికీ రోగులు, వారి బంధువుల సెల్‌ఫోన్‌లతో పాటు బైక్‌లు ఇటీవల ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి.

గస్తీ నిర్వహిస్తున్నా.. ఆగని చోరీలు
జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ దొంగతనాలు మాత్రం ఆగడం లేదు. పట్టణంలోని పలు కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయినా వీరి ఆగడాలను గుర్తించడంలో పోలీసు శాఖ విఫలమవుతుందనే ప్రచారం ఉంది.

సీసీ ఫుటేజీ ద్వారా పరిశీలిస్తున్నాం..
జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గల ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి చోరీకి యత్నించాడు. అప్రమత్తమైన బ్యాంక్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దుండగుడు పరారయ్యాడు. ఆ వ్యక్తి తీసుకొచ్చిన బైక్ కూడా చోరీకి పాల్పడిందే. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నాం. దుండగుడిని పట్టుకునేలా చర్యలు చేపడుతున్నాం. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. – డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

'కంటి వెలుగు'ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మంత్రి ఐకే రెడ్డి, చిత్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యేలు రామన్న, బాపూరావ్

- రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

కైలాస్‌నగర్: అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ తలపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సేవాభావంతో పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 18నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై జెడ్పీ సమావేశమందిరంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు జిల్లాస్థాయి అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లతో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటి చూపు సమస్యను దూరం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.250కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. నేత్ర సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా గ్రామ, వార్డుస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. వంద రోజుల పాటు నిర్వహించే శిబిరాల్లో నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు, మెడిసిన్‌ను ఉచితంగా అందజేస్తారన్నారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని రిమ్స్‌కు రిఫర్ చేయనున్నట్లుగా వెల్లడించారు. శిబిరాలకు వృద్ధులను తీసుకువచ్చేలా చూడటంతో పాటు వారికి అవసరమైన భోజన, తాగునీటి వసతి అందించేందుకు ప్రజాప్రతినిధులు సేవాభావంతో చేయూతనందించాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ఈ నెల 12లోపు మండల, మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో అధికారులు చెప్పేదానికంటే రాయిసెంటర్లు, పటేళ్లు, మహాజన్‌ల ద్వారా ప్రచారం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆదివాసీలకు వందశాతం ప్రయోజనం కల్పించేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ అంధత్వాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని, ఇందులో గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కాగా తన మండల పరిధిలోని 33 పంచాయతీల్లో జరిగే శిబిరాలకు తన వంతుగా రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ప్రకటించారు. శిబిరాలను విజయవంతం చేసేందుకు తన సొంత నిధులతో ప్రచారం కల్పిస్తానని వార్డు కౌన్సిలర్ అజయ్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు మంత్రి ప్రశంస
భద్రత విషయంలో జిల్లా దేశంలో ఐదోస్థానం, రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలువడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్, ఎస్పీతో పాటు పోలీస్ శాఖ సేవలను ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ సభల ద్వారా అవగాహన కల్పించాలి
కైలాస్‌నగర్: ఈ నెల 12 లోగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలతో కంటి వెలుగు, పింఛన్లు, హరితహారం, క్రీడా ప్రాంగణాల వంటి అంశాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రాయిసెంటర్ పెద్దలు, సార్ మేడీలు, పటేళ్లను సమావేశాలకు ఆహ్వానించి కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వాములు చేసి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆసరా పింఛన్‌దారు మరణిస్తే, అతడి భార్యకు పింఛన్ వచ్చే విధంగా 15 రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. హరితహారం కింద నాటిన మొక్కలు ఎండిపోయినట్లైతే వాటి స్థానంలో కొత్తవి నాటి సంరక్షించాలని సూచించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. సమావేశంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈవో గణపతి, డీఆర్డీవో కిషన్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సీఐటీయూ జాతీయ మహాసభలు

ఆదిలాబాద్‌అర్బన్: ఈనెల 18 నుంచి 22 వరకు బెంగళూర్‌లో నిర్వహించనున్న సీఐటీయూ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న కోరారు. యూనియన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జెండా ఆవిష్కరణ చేపట్టారు. కార్మికుల హక్కుల సాధన దిశగా మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, గంగన్న, నరేశ్, ఆశన్న, ఉమాప్రసాద్, కిరణ్, రామన్న, తిరుపతి పాల్గొన్నారు.

ఆదాయ పన్ను వివరాలు అందజేయాలి



మాట్లాడుతున్న కృష్ణకుమార్

కైలాస్‌నగర్: ప్రతీప్రభుత్వ ఉద్యోగి తమ ఆదాయ పన్ను వివరాలు ప్రభుత్వానికి బాధ్యతగా అందించాలని ఆదాయపు పన్నుశాఖ రాష్ట్ర జాయింట్ కమిషనర్ పి.కృష్ణకుమార్ అన్నారు. ఆదాయ పన్ను వసూళ్లు, మినహాయింపులపై జిల్లాలోని వివిధ శాఖల డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారుల (డీడీవో)కు మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదాయ పన్ను చట్టం ప్రకారం డీడీవోలు తమ పరిధిలో పనిచేసే ఉద్యోగుల వేతనాల నుంచి పన్నులను తప్పనిసరిగా మినహాయించాలన్నారు. అనంతరం డీడీవోలు ఇంటి అద్దెలు, వివిధ బిల్లుల ఏరియర్స్‌పై అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, జిల్లా ఆదాయపు పన్ను శాఖ అధికారి మధుసూదన్‌రావు, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రమేశ్‌కుమార్, నిర్మల్ ఏటీవో గంగాధరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇదేం 'కారుణ్య'ం!

- పోస్టులు ఖాళీ లేకుండానే కౌన్సెలింగ్
- నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు
- మళ్లీ అవకాశం ఎప్పుడో అంటూ ఆందోళన



సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

కైలాస్‌నగర్: ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలువాల్సిన అధికారులు వారి పాలిట కఠినంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పోస్టులు కల్పిస్తామని పిలిచి తీరా ఖాళీలు లేవనే కారణంతో తిప్పి పంపించడం వారిని నిరాశకు గురి చేసింది. చదువుకు తగ్గ పోస్టులు లేకపోవడంతో చేసేది లేక వెనుదిరుగాల్సిన పరిస్థితి ఎదురైంది. జిల్లాలో రెండేళ్ల తర్వాత కలెక్టర్ సిక్తా పట్నాయక్ నేతృత్వంలో సోమవారం కారుణ్య నియామకాల కౌన్సెలింగ్ చేపట్టారు. దీంతో బాధిత కుటుంబీకులు తమకు ప్రభుత్వ కొలువు దక్కుతుందనే గంపెడాశతో హాజరయ్యారు. కానీ జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఒక్కటే ఉండటంతో కొంతమంది వెనుదిరుగగా విధి లేని పరిస్థితుల్లో కొంతమంది ఆఫీస్ సబార్డినేట్ పోస్టులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఖాళీలు లేకపోవడంతో మళ్లీ ఎప్పుడు అవకాశం వస్తుందో కూడా తెలియని పరిస్థితి ఉండటం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

కారుణ్య నియామకాలు ఇలా...
ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో మరణిస్తే వారి వారసులకు కారుణ్య నియామకాల కింద సర్కారు ఉద్యోగం కల్పిస్తారు. ఇందుకు అర్హులైన వారు నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలతో మరణించిన ఉద్యోగి శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారికి దరఖాస్తు అందజేయాల్సి ఉంటుంది. ఇలా అందిన దరఖాస్తుదారుల వివరాలతో పాటు తమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు తెలుపుతూ సదరు అధికారి కలెక్టర్‌కు నివేదిస్తారు. వాటి ఆధారంగా కలెక్టర్ నేతృత్వంలో కారుణ్య నియామకాల ప్రక్రియ చేపడుతారు. దరఖాస్తుదారులు పది, ఇంటర్మీడియెట్ చదివిన వారైతే ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో, అంతకు పై చదువులు చదివిన వారికి జూనియర్ పోస్టుల్లో నియమిస్తారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులను పిలిచే ముందే జిల్లాలో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల ఖాళీల వివరాలను అధికారులు ప్రకటించాల్సి ఉంటుంది. అయితే ఈ సారి జిల్లాలో ఇలా జరుగలేదు.

ఖాళీలు లేకుండానే కౌన్సెలింగ్
జిల్లాలో ఈ నెల9న కలెక్టరేట్ సమావేశ మందిరంలో కారుణ్య నియామకాల కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 53మంది అర్హులు కాగా వారందరినీ ఆహ్వానించారు. ఇందులో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదివిన అభ్యర్థులు కూడా ఉన్నారు. అయితే జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఒక్కటే ఖాళీగా ఉన్నట్లుగా ప్రకటించారు. వందకు పైగా ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను ఖాళీలుగా ప్రకటించి కౌన్సెలింగ్ చేపట్టారు. 51 మంది హాజరు కాగా ఒకరు జూనియర్ అసిస్టెంట్ పోస్టు తీసుకోగా, తప్పనిసరి పరిస్థితుల్లో 26మంది ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను పొందారు. మిగతా వారు వాటిపై ఆసక్తి చూపకపోవడంతో తాము అందుకు సుముఖంగా లేమని తెలిపేలా అధికారులు వారి నుంచి అన్‌విల్లింగ్ లెటర్లు తీసుకున్నారు.అయితే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా లేనప్పుడు అందరినీ ఎందుకు పిలిచారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో వీఆర్వోలను సర్దుబాటు చేయడంతో పాటు మరికొన్ని పోస్టులను టీఎస్‌పీఎస్‌సీ ద్వారా భర్తీ చేసేందుకు ఇటీవల అప్పగించారు. అధికారుల నిర్వాకంతోనే తమకు నష్టం జరిగినట్లుగా బాధిత అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

మళ్లీ ఎప్పటికో ..?
కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్ పోస్టులను పొందాలంటే అర్హులైన అభ్యర్థులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి ఉంటుంది. ప్రస్తుతమున్న వారు పదవీ విరమణ, లేదంటే మరణిస్తే, లేదా పదోన్నతి వస్తే తప్ప ఆ పోస్టులు ఖాళీ కావు. కొత్తగా పోస్టులు మంజూరైతే తప్ప వీరికి అవకాశం రాదు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఏళ్ల తరబడి నిరీక్షించకతప్పని పరిస్థితి.

నిబంధనల ప్రకారమే..
నిబంధనల ప్రకారంగానే కారుణ్య నియామక కౌన్సెలింగ్ నిర్వహించాం. ఆయా శాఖల అధికారులు ఇచ్చిన ఖాళీల ఆధారంగానే ఈప్రక్రియ చేపట్టాం. జిల్లానే కాదు.. రాష్ట్రంలో ఎక్కడా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగాలేవు. ప్రస్తుత ఉద్యోగి పదవీ విరమణ,మరణం, పదోన్నతి వస్తే తప్ప ఆపోస్టులు ఖాళీ కావు. మళ్లీ కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందో కూడా చెప్పలేని పరిస్థితి. – అరవింద్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో

క్లుప్తంగా

విద్యుత్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఈ నెల 21నుంచి కేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరలో విద్యుత్ పనులను ఎస్ఈ సంపత్ మంగళవారం పరిశీలించారు. అవసరమైన సామగ్రి, ఖర్చు వివరాలు తెలుసుకున్నారు. ఆలయం, మెస్రం వంశీయులు బస చేసే గోవడ్, మర్రిచెట్టు, జాతర ప్రాంతంలో ఎలాంటి విద్యుత్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వెంటనే స్తంభాలు ఏర్పా టు చేసి విద్యుత్ సరఫరా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈ సుభాష్, ఏడీఏ చంద్రశేఖర్, ఏఈ రోహిదాస్ తదితరులున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 17మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా కళాశాలల్లో విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతుండగా పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. నేరడిగొండ చైతన్య డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బోథ్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఇచ్చోడ ఛత్రపతి డిగ్రీ కళాశాలలో ఐదుగురు, ఖానాపూర్‌లోని అజ్మీర రేఖా శ్యాం డిగ్రీ కళాశాలలో ఒకరు, ఖానాపూర్‌లోని ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు, చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు.

వేలం ద్వారా రూ.11.18లక్షల ఆదాయం

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరలో వివిధ హక్కుల కోసం మంగళవారం ఆర్డీవో సురేశ్ సమక్షంలో దేవాదాయ, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. తైబజార్ ద్వారా రూ.7.87లక్షలు, వాహనాల పార్కింగ్ ద్వారా రూ.1.66లక్షలు, విద్యుత్ సరఫరా ద్వారా రూ.1.13లక్షలు, ప్యాలల దుకాణం ద్వారా రూ.42 వేలు, కొబ్బరికాయల దుకాణం ద్వారా రూ.10,016.. మొత్తంగా రూ.11.18లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో రాజమౌళి తెలిపారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, తహసీల్దార్ సోము, ఎంపీటీసీ మడావి భీంరావ్, మెస్రం వంశీయులు ఆనంద్‌రావ్, నాగ్‌నాథ్ తదితరులున్నారు.

బాసరలో ఒడిబియ్యం లెక్కింపు


ఒడిబియ్యం లెక్కిస్తున్న సిబ్బంది

బాసర (ముధోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఒడి బియ్యం లెక్కించారు. 50.13 క్వింటాళ్ల ఒడి బియ్యం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 273 కిలోల ఎండుకొబ్బరి, 26 కిలోల బరడిపోకలు, 54 కిలోల పసుపు కొమ్ములు, 19కిలోల బాదం, 30కిలోల ఖర్జూర పండ్లు, విడి సరుకులు సమకూరినట్లు పేర్కొన్నారు.

ఆదివాసీల ఆత్మబంధువులు!

- హైమన్‌డార్ఫ్, ఎలిజబెత్ దంపతులు
- నేడు మార్లావాయిలో 36వ వర్ధంతి
- గిరి సంప్రదాయ పద్ధతిలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ సభ్యులు


హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాలు


మార్లావాయి గ్రామస్తులతో హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు (ఫైల్)

నార్నూర్: అడవుల మధ్య బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్న ఆదివాసీల జీవితాల్లో వారు వెలుగులు నింపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 10వేల కుటుంబాలకు 1.60లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసి వారి గుండెల్లో కొలువయ్యారు. వారంతా నేడు అభివృద్ధి దిశగా పయనిస్తున్నారంటే ఇది ముమ్మాటికీ వారి కృషే. అందుకే నేటికీ అడవిబిడ్డలు ఆ పుణ్యదంపతులను మరువలేకపోతున్నారు. ప్రతీ జనవరి 11న కుమురంభీం జిల్లా జైనూర్ మండలం మార్లావాయి గ్రామంలో పూర్తిగా గిరిజన సంప్రదాయ పద్ధతిలో వారి వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. విశేష సేవలందించి వారి గుండెల్లో గూడు కట్టుకున్న మానవపరిణామ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

అధ్యయనానికి వచ్చి..

హైమన్‌డార్ఫ్ పూర్తి పేరు క్రిస్టోఫ్‌వోన్ ఫ్యూరర్ హైమన్‌డార్ఫ్. 1909 జూన్ 22న ఆస్ట్రేలియాలో జన్మించారు. మన దేశంలోని అస్సాం, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లోగల ఆదిమజాతులకు చెందిన కొనాక్, నాగాల జీవన శైలిపై 1930లో అధ్యయనం చేసి మానవ పరిణామ శాస్త్రవేత్త అయ్యారు. నిజాం పాలనలో అడవిలో బాహ్యప్రపంచానికి దూరంగా ఉన్న ఆదివాసీలు పోడు సాగు కోసం ఆరాట పడుతున్న సమయమది. అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలకు భూములపై హక్కు కల్పించాలని అప్పటి నిజాం ప్రభుత్వ హయాంలో కొమురంభీం తిరగబడ్డారు. ఈ పోరాటంలో భీం నవంబర్ 1, 1940లో వీరమరణం పొందారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసీల తిరుగుబాటు తనానికి గల కారణాలు తెలుసుకునేందుకు అప్పటి నిజాం ప్రభుత్వం మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ ను ఇక్కడికి పంపించింది. 1940లో ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ దంపతులు ఆదివాసీల ఆచారాలు, సంప్రదాయాలు, జీవన శైలిని పరిశీలించారు. ఇక్కడే వారితో కలిసిపోయి మార్లావాయి గ్రామంలో స్థిరపడ్డారు.

మార్లావాయిలో సమాధులు..

1990లో బెట్టి ఎలిజిబెత్ హైదరాబాద్‌లో మృతి చెందగా.. ఆమె కోరిక మేరకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం మార్లావాయి గ్రామంలో సమాధి నిర్మించారు. ఎలిజబెత్ మరణానంతరం డార్ఫ్ ఇంగ్లాండ్‌కు తిరిగివెళ్లారు. అయినప్పటికీ ఆయన తరచూ మార్లావాయిని సందర్శించేవారు. 1995లో జూన్11న ఇంగ్లాండ్‌లో హైమన్‌డార్ఫ్ తుది శ్వాస విడిచారు. డార్ఫ్ దంపతులు ఆదివాసీలకు చేసిన సేవలను నేటికీ అడవిబిడ్డలు మరువలేకపోతున్నారు. ఏటా జనవరి 11న మార్లావాయిలో ఆ పుణ్య దంపతుల వర్ధంతిని పూర్తిగా గిరిజన సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారు. కాగా, వీరి వర్ధంతిని ప్రభుత్వమే ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీలు కోరుతున్నారు. నేడు వారి 36వ వర్ధంతిని మార్లావాయి గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించనుండగా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి ఎంపీ సోయం బాపూరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వారు అందించిన సేవలివి..

ఆదివాసీల స్థితిగతులు, వారి అభివృద్ధికి కావాల్సిన సహకారం కోసం డార్ఫ్ అప్పటి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అతడి కృషి ఫలితంగా 1944 నుంచి 1948 వరకు నిజాం హయాంలో 10వేల గిరిజన కుటుంబాలకు రూ.1.60లక్షల ఎకరాల భూపంపిణీ జరిగింది. అంతేకాకుండా డార్ఫ్ సలహా మేరకు 1945లో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకాధికారిని నియమించారు. 1946లో మార్లావాయి, తాడవాయి, కొద్దమెల్ల ప్రాంతాల్లో 30 గిరిజన పాఠశాలలు స్థాపించారు. 1947లో గిరిజన ప్రాంతాలకు దస్తూరి-ఉల్-అమాల్ (1956 పల్లి) జారీ అయింది. దీని ప్రకారం గిరిజనుల హక్కుల పరిరక్షణకు అధికారులను నియమించారు. డార్ఫ్ ప్రోత్సాహంతో తొలిసారిగా ఆదివాసీ తెగ నుంచి తుకారాం ఐఏఎస్ సాధించారు. 1949లో నిజాం ప్రభుత్వం తదుపరి తెలంగాణలో హైదరాబాద్ ప్రభుత్వం వచ్చింది. నిజాం ప్రభుత్వ హయాంలో డార్ఫ్ చేసిన అధ్యయన ప్రతులు ప్రభుత్వానికి అందించారు. దీని మూలంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో గిరిజనుల కోసం ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్ల చట్టాలకు చోటు దక్కింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 జనవరి 26 నుంచి ఆనాటి 40 గ్రామాలు షెడ్యూల్డ్ ఏజెన్సీగా మారాయి. గిరిజనులకు రక్షణ కల్పించి 1949 నాటి దస్తూర్-ఉల్-అమాల్‌పై రాష్ట్రంలోనూ ఏజెన్సీ ప్రాంతంలో బ్రిటిష్ చట్టం (1915)ను సవరించబడి భూ బదలాయింపు చట్టం 1959లో ఏర్పడింది. తర్వాత 1/70 చట్టం అమలులోకి వచ్చింది.

పరిశోధన రచనలు

హైమన్‌డార్ఫ్ చుంచులు, గోండులు, కోయలపై పరిశోధన రచనలు చేశారు. ఇందులో చుంచుల్, జంగల్ ఫోక్స్ దక్కన్, రాజ్‌గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్, ద గోండ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రెడిషన్ అండ్ ఉల్యాన్ ఇండియన్ ట్రైబ్.. అనేవి ప్రసిద్ధిగాంచినవి. ఆదివాసీలతో డార్ఫ్ దంపతులకు ఏర్పడిన అనుబంధానికి ప్రతీకగా వారి సంతానానికి లచ్చుపటేల్‌గా నామకరణం చేశారు.

అధికారికంగా నిర్వహించాలి



హైమన్‌డార్ఫ్ వర్ధంతిని ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలి. ఏటా జనవరి 11న హైమన్‌డార్ఫ్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులే నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి వర్ధంతిని నిర్వహిస్తే ఆదివాసీ సమాజం హర్షం వ్యక్తంజేస్తుంది.

– కనక ప్రతిభ, సర్పంచ్, మార్లావాయి

ఆశయ సాధనకు కృషి చేయాలి



ఆదివాసీ గిరిజనులు అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యంతోపాటు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు ఎంతో కృషిచేశారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తాం. వర్ధంతి నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశాం.

– కనక వెంకటేశ్, వర్ధంతి నిర్వహణ కమిటీ చైర్మన్

ట్రిపుల్‌ఐటీలో పేరెంట్స్ మీటింగ్


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

బాసర (ముధోల్): బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల తల్లిదండ్రులతో ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మంగళవారం కళాశాలలోని సాత్ భవనంలో సమావేశమయ్యారు. పిల్లల చదువుల విషయంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతీ బుధవారం విద్యార్థులు నేరుగా డైరెక్టర్‌ను కలిసే వెసులుబాటు కల్పించామని చెప్పారు. గతానికి భిన్నంగా పరీక్షా ఫలితాలను రెండు వారాల్లోపు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అడ్మిన్లు, అధికారులు, కళాశాల డైరెక్టర్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహిళా సంఘాల స్టాల్


కళాఖండాలను ప్రదర్శిస్తున్న సభ్యులు

నార్నూర్: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో సరస్వతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ వీవో గ్రూప్ సభ్యులు మంగళవారం ప్రదర్శించిన వెదురు కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చేతితో తయారు చేసిన 150 రకాల వెదురు కళాఖండాలను ప్రదర్శించినట్లు ఐకేపీ ఏపీఎం రమేశ్ తెలిపారు. గృహాలంకరణలు, చార్మినార్, ఈఫిల్‌టవర్, తాజ్‌మహల్, నెమలి, పక్షులు, ఎడ్లబండి, పూలస్టాండ్ తదితర ఉత్పత్తులున్నట్లు పేర్కొన్నారు. మంత్రి ఐకే రెడ్డి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ప్రదర్శనను తిలకించారు. మహిళా సంఘాల సభ్యులను అభినందించారు.



ఇందులో మొదటి చిత్రం 13ఏళ్ల క్రితం వరకు ఇరుకుగా ఉన్న దస్నాపూర్ వంతెన. రెండోది అభివృద్ధిలో భాగంగా దానిని విస్తరించగా ప్రస్తుతం ఇలా కనిపిస్తోంది. గతంలో ఈ వంతెనపై చిన్నపాటి రాస్తారోకో జరిగినా రోడ్డుకిరువైపులా గంటల తరబడి వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడేది. నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయగా ఇలా వాహనాలు వేగంగా సాగిపోతున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయాలి


సైన్స్‌ఫేర్‌ను తిలకిస్తున్న మంత్రి ఐకే రెడ్డి

- రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి
- ఉట్నూర్‌లో సైన్స్‌ఫేర్ ప్రారంభం

ఉట్నూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభతోపాటు సృజనాత్మకత వెలికితీయాలని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సైన్స్‌ఫేర్‌ను ఆయన ఎమ్మెల్యే రేఖానాయక్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల్లో ప్రతిభకు కొదువలేదన్నారు. వారిని ప్రోత్సహిస్తే ఎన్నో ఆవిష్కరణల ద్వారా ఉన్నత స్థానాలకు చేరుతారని చెప్పారు. ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ నిర్వహించామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 133 ఆశ్రమ పాఠశాలలుండగా, ఎనిమిది డివిజన్ల నుంచి 12 మంది విద్యార్థుల చొప్పున 96 మంది వివిధ ఆవిష్కరణలు చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. మాజీ ఎంపీ గోడం నగేశ్, ఆదిమ గిరిజన సలహా మండలి అధ్యక్షుడు కనక లక్కేరావ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాంనాయక్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఎంపీపీ జైవంత్‌రావ్, డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏటీడీవోలు క్రాంతి, నిహారిక, సౌజన్య, ఆయా విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

తాంసి: అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. భీంపూర్ ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన యువకుడు కరాడే అజయ్ (23) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు త్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు అతడిని వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని భీంపూర్ ఎస్సై రాధిక పరిశీలించారు. మృతుడి తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కొడుకు పోయిన పుట్టెడు దుఃఖంలోనూ అజయ్ తల్లిదండ్రులు నేత్రదానం చేశారు. మృతుడి కళ్లను ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ వైద్యులు సేకరించారు. కాగా, కొడుకు పోయిన బాధలోనూ నేత్రదానానికి అంగీకరించిన తల్లిదండ్రులను సర్పంచ్ నరేందర్, గ్రామస్తులు అభినందించారు.

స్కూటీ పైనుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

కుభీర్: మండలంలోని న్యూసాంవ్లి గ్రామానికి చెందిన జగ్మే గంగాధర్ మంగళవారం స్కూటీపై భైంసాకు వెళ్తున్నాడు. సాంవ్లి-కుంటి గ్రామాల మధ్య తనకుతానే స్కూటీ పైనుంచి కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో భైంసాకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా, గంగాధర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముధోల్: ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన మంగళవానం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసర మండల కేంద్రానికి చెందిన శివ ద్విచక్రవాహనంపై భైంసా నుంచి బాసర వైపు వెళ్తుండగా.. మహారాష్ట్రకు చెందిన సక్షేణ విఠోలితండా నుంచి భైంసా వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ముధోల్ ప్రభుత్వ జూనియస్ కళాశాల సమీపాన ఈ రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివకు తీవ్ర గాయాలు కాగా, సక్షేణకు స్వల్పగాయాలయ్యాయి. ఇరువురిని చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా సుపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆటో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్ కాలనీలో ఈనెల 5న అదే కాలనీకి చెందిన సక్కిరెడ్డి లక్ష్మి తన స్నేహితురాలు రోషిని రోడ్డు పక్కన నిలబడి ఉన్నారు. ఈక్రమంలో ఆటో ఢీకొనగా లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రిమ్స్‌కు తరలించారు. చికిత్స అనంతరం ఆమె మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో యువకుడిపై దాడి

ఆదిలాబాద్‌టౌన్: యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన వంశీకృష్ణ, ఆదిలాబాద్‌రూరల్ మండలం అర్లి(బీ) గ్రామానికి చెందిన సాయికు పాత కక్షలున్నాయి. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని డైట్ గ్రౌండ్‌కు రావాలని వంశీకృష్ణ సాయికి ఫోన్ చేశాడు. దీంతో సాయి అక్కడికి వెళ్లాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో వంశీకృష్ణ సాయి ఛాతిలో కత్తితో పొడిచాడు. దీంతో సాయి గాయపడగా స్థానికులు అతడిని రిమ్స్‌కు తరలించారు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మాజీ హోంగార్డు ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ హోంగార్డు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో హోంగార్డుగా పని చేసి సస్పెన్షన్‌కు గురైన ముడారపు రమేశ్ (45) కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో సోమవారం ఇంటి వద్ద విషం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

గడ్డివాము దగ్ధం

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన రైతు కట్కం రవీందర్ అలియాస్ బర్ల స్వామికి చెందిన గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరేలోపు పూర్తిగా కాలిబూడిదైంది. సుమారు రూ.2లక్షల విలువైన గడ్డి కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 60మందికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 60మందికి ఒక్కరోజు జైలుశిక్ష విధిస్తూ ఆదిలాబాద్ సెకండ్ క్లాస్ ఇన్‌చార్జి జడ్జి యశ్వంత్‌సింగ్ చౌహాన్ మంగళవారం తీర్పు చెప్పారు. ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసుల్లో వీరు నిందితులు. జిల్లాలో ఇలాంటి తీర్పు రావడం ఇదే మొదటిసారి. గతేడాది అత్యధికంగా ఐదువేలకు పైగా డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 10రోజుల్లోనే 300 కేసులు నమోదయ్యాయి.

నిర్మల్‌లో పలువురికి..

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి మూడురోజుల సాధారణ జైలు, 34మందికి జరిమానా విధిస్తూ ద్వితీయశ్రేణి న్యాయమూర్తి అజిత్ రెహమాన్ తీర్పు చెప్పారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. ఇందులో ఒకరికి సాధారణ జైలు శిక్ష, 34 మందికి రూ.55,200 జరిమానా విధించారు.

కడెం ఆయకట్టుకు నీటి విడుదల

కడెం: కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువకు మంగళవారం ఎమ్మెల్యే రేఖానాయక్ యాసంగి సాగుకు నీటిని విడుదల చేశారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, 694.550 అడుగులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎడమ కాలువకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ శంకర్, డైరెక్టర్ మంగ, సర్పంచ్ అనూష తదితరులు పాల్గొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

గోదావరి జలంతో తిరుగు పయనం

- పుణ్యస్నానాలాచరించి, రాగిపాత్రలో నీటిని నింపి..
- కేస్లాపూర్‌కు బయలుదేరిన వంశ పెద్దలు


తిరుగు పయనమైన మెస్రం వంశీయులు

జన్నారం: కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా మహాపూజకు కావాల్సిన గంగాజలం కోసం మెస్రం వంశీయులు మండలంలోని కలమడుగు గోదావరికి మంగళవారం ఉదయం చేరుకున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి వంటలు చేసుకుని భోజనాలు చేశారు. గోదావరి తీరంలోని హస్తల మడుగులో ప్రత్యేకమైన రాగి చెంబులో నీటిని నింపారు. అనంతరం చెంబును కర్రకు కట్టుకుని సంప్రదాయ తెల్లని దుస్తులతో తిరుగు పయనమయ్యారు. ఈ నెల 2న కేస్లాపూర్ నుంచి బయలు దేరిన మెస్రం వంశీయులు కాలినడకన మంగళవారం చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఉట్నూర్, దొడండాలో బస చేసి, విశ్రాంతి తీసుకున్న అనంతరం 17న ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకుని పూజలు చేయనున్నట్లు మెస్రం వంశ పెద్దలు ప్రదాన్ మెస్రం దాదరావు, కటోడా మెస్రం కోసు, హన్మంతరావు, మెస్రం ఉద్యోగుల సంఘం నాయకులు మెస్రం మనోహర్, మెస్రం దేవరావు, మెస్రం శేఖు, తుకారాం నాగనాథ్ తెలిపారు.

క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీలను కలిసిన పలు సంఘాల నాయకులు



ఎస్పీకి వివేకానంద చిత్రపటాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా యువజన సంఘాల సమితి నాయకులు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిలను మంగళవారం కలిశారు. వివేకానంద జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటాలను అందజేశారు. పట్టణంలోని డైట్ కళాశాల ఎదురుగా గల వివేకానంద విగ్రహం ఎదుట ఈనెల 12న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు బాలశంకర్‌కృష్ణ, ఊరే గణేశ్, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, పస్పుల రాజు, కలీం, అర్బాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పెర్సపేన్ పూజలు



పూజలో పాల్గొన్న ఆదివాసీలు

బోథ్: మండలంలోని మామిడిగూడెంలో మంగళవారం పెర్సపేన్ పూజలను ఘనంగా నిర్వహించారు. పవిత్ర పుష్యామి మాసంలో ఆదివాసీల కులదైవమైన పెర్సపేన్ పూజలు చేస్తారు. ఈ పూజలు మూడు రోజుల పాటు జరుపుకుంటారని ఆదివాసీలు తెలిపారు. సిడాం జంగుబాపు, సిడాం భీంరావ్, లాలూరాం, కాశీ పటేల్ ఉన్నారు.

అటవీ సంరక్షణకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఆర్వో గణేశ్

నేరడిగొండ: అటవీ సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎఫ్‌ఆర్వో గణేశ్ అన్నారు. మండలంలోని ఇస్పూర్ గ్రామంలో మంగళవారం వనసంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపద తరలిపోకుండా గ్రామస్తులు సహకరించాలని కోరారు. దీంతోపాటు వన్యప్రాణులను వేటాడితే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ముందస్తు సమాచారం మేరకు రాజురా గ్రామంలో తనిఖీలు చేపట్టగా, సుమారు రూ.15 వేల విలువ గల కలప స్వాధీనం చేసుకున్నామన్నారు.

'కంటి వెలుగు'ను జయప్రదం చేయండి

తలమడుగు: ఈనెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో వైద్యాధికారులు వంశీకృష్ణ, శ్రీనివాస్, హరీశ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖరా(కె)లో ప్రత్యేక సర్వే



వివరాలు అందిస్తున్న మహిళ

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో మంగళవారం ప్రత్యేక సర్వేను సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో సంసద్ ఆదర్శ గ్రామయోజన కింద గ్రామాన్ని రాజ్యసభ సభ్యుడు జోగినిపెల్లి సంతోష్‌కుమార్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ప్రతి ఇంటింటా తిరుగుతూ కుటుంబ సర్వేను నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ సర్వేను మరో మూడు రోజుల పాటు కొనసాగుతందన్నారు. సర్వే పూర్తి తర్వాత నివేదికను సంతోష్‌కుమార్ కార్యాలయనికి పంపించనున్నట్లు ఆమె తెలిపారు.

వాహనాల తనిఖీ

ఆదిలాబాద్‌రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదిలాబాద్ రూరల్ ఎస్సై నాగనాథ్ సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. సరైన వాహనపత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ఎస్సై మాట్లాడుతూ పెండింగ్ చలాన్లు చెల్లించాలని వాహనదారులకు సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుల వాహనాల తనిఖీతో రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి.

పల్లెల్లో 'బెల్టు' రక్కసి

- 24 గంటలు అందుబాటులో మద్యం
- తాగి తూలుతున్న యువత
- అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- మద్యం మత్తులో పెరిగిన ఆత్మహత్యలు
- చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు



ఇచ్చోడలో గిరిజన గురుకుల బాలుర పాఠశాల సమీపంలో బెల్ట్‌షాప్

ఇచ్చోడ: పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలుస్తుండటంతో యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారు. అప్పులు, ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. ఆత్మహత్యలు, ఘర్షణ వాతావరణానికి మద్యం మత్తు ప్రేరేపిస్తుండడం ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో కుటుంబాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. హోటళ్లు, కిరాణం, కూల్‌డ్రింక్ షాపులు, గృహాల మాటున బెల్ట్‌దందా యథేచ్ఛగా సాగుతోంది. వీటిని తొలగించాలని డిమాండ్ ఉన్నా విక్రయాల టార్గెట్లు సాధించే క్రమంలో అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు.

ఫోన్ చేస్తే క్షణాల్లో మద్యం..

వైన్స్‌షాపుల్లో మద్యం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్ణీత సమయంలో మాత్రమే విక్రయిస్తారు. ఎలాంటి ఉద్దెర ఇవ్వరు. అవే బెల్టుషాపుల్లో 24 గంటల మద్యం అందుబాటులో ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో నిర్వాహకులకు ఫోన్‌చేస్తే చాలు క్షణాల్లో మద్యం అందజేస్తున్నారు. డబ్బులు లేకున్నా, అవసరం మేరకు ఉద్దెర ఇవ్వడంతో యువత, రైతులు, కూలీలు మద్యానికి బానిసలుగా మారుతున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చిన్నతనం నుంచి తాగుడుకు బానిసలవ్వడంతో మధ్య వయస్సులో పలువురు మృత్యువాత పడుతుంటడటంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

జరిగిన సంఘటనలు..

- భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన ముడుపు కృష్ణ (25). మద్యం మత్తులో పురుగుల మందు తాగి గతనెల 13న ఆత్మహత్య చేసుకున్నాడు.
- జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన ఓంకార్(48) మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవ పడ్డాడు. తన ఇద్దరు పిల్లలను తీసుకొని భార్య బంధువుల ఇంటికి వెళ్లడంతో గతనెల 23న ఓంకార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు.
- తలమడుగు మండలం పల్సి(కే) గ్రామానికి చెందిన తలమ్ రమేశ్ (24) మద్యం మత్తులో ఉరివేసుకుని గతనెల 25న ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- బోథ్ మండల కేంద్రానికి చెందిన అల్లాడి శివ (21) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు మందలించడంతో గతనెల 26న పొచ్చెర జలపాతంలో దూకి చనిపోయాడు.
- బజార్‌హత్నూర్ మండలం వర్తమాన్నూర్‌కు చెందిన అత్రం కృష్ణ(35) గతకొంత కాలంగా మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఈనెల 4న ఆత్మహత్య చేసుకున్నాడు.

ట్రీట్‌మెంట్‌తో నయం



మద్యం మత్తులో విచక్షణను కోల్పోయి ఆత్మహత్యలకు దారితీస్తాయి. బాధలో, ఆర్థిక పరిస్థితులు కావచ్చు. మద్యానికి అలవాటుపడ్డ వారికి కౌన్సెలింగ్ కన్నా ట్రీట్‌మెంట్ ద్వారా పూర్తిగా తాగుడు మానిపించవచ్చు.

– ఓంప్రకాశ్, సైక్రియాట్రిస్ట్, రిమ్స్, ఆదిలాబాద్

ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి



మంచి భవిష్యత్తు ఉన్న యువత ఆత్మహత్యలకు పాల్పడడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. యువత ఆత్మస్థైర్యం పెంపొందించుకుని తమ లక్ష్యాలను సాధించాలి.

– సంగెం సుధీర్‌కుమర్, న్యాయవాది, ఆదిలాబాద్

ప్రజా సంక్షేమమే ధ్యేయం



కల్యాణ లక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని దంతన్‌పల్లి, లక్కారం గ్రామాల్లో మైనార్టీ భవన నిర్మాణాలకు మంగళవాకం భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ దేశ రాజకీయాల్లో ప్రభావం చూపనుందన్నారు. ఎంపీపీ జైవంత్‌రావ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అజిమొద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కందుకురి రమేశ్, జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్, నాయకులు సులేమాన్, శ్రీను, నజీర్, శారీఫ్, నవీన్, భగవంత్‌రావ్, సలీం, ఫరూక్, మునీర్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి దుర్గారాణి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి టి.దుర్గారాణి అన్నారు. మండలంలోని ఏమాయికుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉంటేనే ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై భీంరావ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఉచిత శిక్షణ

ఆదిలాబాద్‌రూరల్: ఉపాధి హామీ పథకం 2018–19 సంవత్సరంలో వంద రోజులు పూర్తిచేసిన కూలీలకు వర్మీ కంపోస్ట్ తయారీపై ఉచితంగా పది రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ సునీల్, అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్ తెలిపారు. మండలంలోని వన్వట్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కూలీలకు శిక్షణ కల్పించడంతో పాటు రోజువారీ కూలి రూ.257 ఇస్తామని పేర్కొన్నారు. ఏపీవో గంగాధర్, సర్పంచ్ తూర్పబాయి మాధవ్‌రావు, ఉప సర్పంచ్ నందు, లక్ష్మణ్, క్షేత్ర సహాయకులు మహేందర్, అనిల్, ఇద్రు, సాంబశివ్, పంచాయతీ కార్యదర్శి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

బయో మైనింగ్ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం



వివిధ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: మున్సిపల్ పరిధిలోని బంగారుగూడ డంపింగ్‌యార్డులో మంగళవారం బయో మైనింగ్ ప్రాజెక్టు పనులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి డంపింగ్ యార్డులో చేపడుతున్న వివిధ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బంగారిగూడ పరిధిలోని 36 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్ యార్డులో రూ.లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థ పదార్థాలు ఉన్నట్లు సర్వేలో తేలిందన్నారు. ఇలాంటి వ్యర్థాలను వేస్ట్ చేయకుండా రీసైక్లింగ్ ద్వారా ఎరువుల తయారీ కోసం ఉపయోగించనున్నామని, అందుకు ఈ ప్రాజెక్టును ప్రారంభించినట్లు చెప్పారు. రూ.10 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును ఆరునెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పట్టణంలోని చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ చేసిన చెత్తను బయో మైనింగ్ ప్రాజెక్టు ద్వారా శుద్ధిచేసి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారీ చేస్తామన్నారు. అయన వెంటన మున్సిపల్ కమిషనర్ శైలజ, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, ఫ్లోర్‌లీడర్ బండారి సతీశ్, ఏజాజ్, మల్లయ్య, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా దాతలు ముందుకు వచ్చి పేద ప్రజలను ఆదుకోవాలని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులకు మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని 200 బ్లాంకెట్లు అందించగా మంగళవారం పంపిణీ చేశారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, దుర్గం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహను సందర్శించిన ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలోని శిశుగృహ, బాలసదన్‌ను ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వసతులపై ఆరా తీయడంతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. శిశుగృహలో ఎంత మంది చిన్నారులు ఉన్నారనే విషయాన్ని అడగగా, ఆరుగురు చిన్నారులున్నారని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. బాలసదనం, శిశుగృహలో ఉండే చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఐసీడీఎస్ పీడీ మిల్కాను ఆదేశించారు. కాగా పీడీ ఐసీడీఎస్ నూతన కార్యాలయం కోసం ప్రభుత్వం రూ.కోటి 35 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణ కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు.

క్యాట్ కృషి అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో భాగంగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (క్యాట్) చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణ శివారు ప్రాంతంలోని బెల్లూరి చాందా (టి) మైదానంలో క్యాట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రీ డేస్ స్కూల్ టెస్ట్ మ్యాచ్‌ను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. క్యాట్ అధ్యక్షుడు సునీల్ బాబు, ఉపాధ్యక్షుడు రాణా ప్రతాప్, నేషనల్ కోఆరినేటర్ శ్రీనివాస్ బాబు, జిల్లా కార్యదర్శి రంగినేని శ్రీనివాస్, ఎంపీపీ గోవర్ధన్, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణు గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలను ఎండగట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్

జైనథ్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం పెంచేలా కార్యకర్తలు పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రకు ఈనెల 26న ప్రతీ బూత్ స్థాయిలో పార్టీ జెండాలు ఆవిష్కరించాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ హామీలు నిలబెట్టుకోవడంలో తీవ్రంగా విఫలమయ్యాయన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దిగంబర్‌రావ్ పాటిల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెళ్లి శ్రీధర్, టౌన్ ప్రెసిడెంట్ నగేశ్, ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, నాయకులు పిడుగు స్వామి, బిక్కి గంగన్న, బద్దం సురేష్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఇచ్చోడ: గత తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు అడే గజేందర్ సూచించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 26 నుంచి పాదయాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఈనెల 26న ప్రతి బూత్‌లో పార్టీ జెండాలు ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతి ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుబంధు అందిస్తామని పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు వివరించాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మైనార్టీ, ఎస్సీ సెల్ చైర్మన్లు ముస్తాఫా, కొత్తురి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి భీమన్న, మండల ప్రధాన కార్యదర్శి బోలే ప్రభాకర్, వినాయక్‌రావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

బోథ్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని పార్టీ నియోజకవర్గ నాయకుడు ఆడె గజేందర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూత్ ఖాన్, మండల కన్వీనర్ మహేందర్, కిసాన్ సెల్ జిల్లా నాయకులు మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, జక్క బాపురెడ్డి, సాఫీర్ అహ్మద్, సురేందర్, శేఖర్, అనిల్, రాజశేఖర్, ఉమేష్, గంగారెడ్డి, వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను జెడ్పీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నటరాజ్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీలను విద్యుత్‌శాఖ జిల్లా ఎస్‌ఈ కె.సంపత్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సంఘ బాధ్యులతో కలిసి వాటిని విడుదల చేశారు. తమ హక్కులు, బాధ్యతల సాధనతోపాటు సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు మరింత బాధ్యతతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్‌ఈ వారికి సూచించారు. సంఘం రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ పి.గోపాల్‌రావు, జిల్లా కార్యదర్శి రహీం, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు చొప్పదండి సంతోష్, బైరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని మావల జెడ్పీటీసీ నల్ల వనిత అన్నారు. మన ఊరు–మనబడిలో భాగంగా మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో రూ.39 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులను మంగళవారం ప్రారంభించారు. ఉన్నత పాఠశాలలో రూ.68 లక్షలతో అదనపు గదులతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సర్పంచ్ దొగ్గలి ప్రమీలా, నాయకులు రాజేశ్వర్, ఏవన్, ఉమాకాంత్‌రెడ్డి, సుదీర్, విజయ్, గంగన్న పాల్గొన్నారు.

నార్నూర్: గాదిగూడ మండలం లోకారి(కే) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను సర్పంచ్ మెస్రం దేవురావు మంగళవారం ప్రారంభించారు. డీఈఈ శివ, ఏఈఈ సునీల్ రాథోడ్, ఎంఈవో ఆశన్న, మెస్రం లింగు, మెస్రం శేఖర్, సురేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

జైనథ్/ఇంద్రవెల్లి/ఇచ్చోడ: రంగారెడ్డి జిల్లాలో ఈనెల 13, 14వ తేదీల్లో జరిగే యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కోరారు. మండల కేంద్రంలో ఆయన ఉపాధ్యాయులు, ఇంద్రవెల్లిలో మండల అధ్యక్షుడు ఆడే సురేష్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇచ్చోడలో ఎంఈవో ఉదయ్‌రావుతో కలిసి సంఘం జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ మహాసభలకు మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, తదితరులు హాజరవుతారని తెలిపారు. విద్యావంతులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బోథ్: మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తన నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు. సోమ లక్ష్మి రూ.44 వేలు, లోలపు యశోద రూ.45,500 విలువైన చెక్కులను అందజేశారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, సోమ శంకర్, లోలపు పోశెట్టి, సత్యనారాయణ ఉన్నారు.

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన ఆపతి విష్ణు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం మంజూరైంది. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఆయన నివాసంలో స్థానిక నాయకులతో కలిసి రూ.42 వేల చెక్కును అందించారు. సర్పంచ్ నరేందర్ ఉన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం

ఆదిలాబాద్: ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను మంగళవారం తన నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, కోశాధికారి సంతోష్, సంయుక్త కార్యదర్శి విశాల్ తదితరులు ఉన్నారు.

దూబార్‌పేట్ సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్చోడ: మండలంలోని దూబార్‌పేట్ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మంగళవారం దూబార్‌పేట్ గ్రామస్తులు ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి సమస్యలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తానని, ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచ్ చాకటి రవి పాల్గొన్నారు.

సన్మానం

తలమడుగు: టీఎన్‌జీవో జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైన మాణిక్‌రావును కజ్జర్ల గ్రామంలో గ్రామస్తులు, నాయకులు మంగళవారం సన్మానించారు. ప్రశాంత్‌రెడ్డి, జైభత్‌రెడ్డి, రాజుగౌడ్, రవీందర్‌గౌడ్, నరేందర్, నర్సారెడ్డి, కృష్ణారెడ్డి, నరేశ్ యాదవ్, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోథ్ ఎంపీపీకి సన్మానం

బోథ్: ఢిల్లీలో ఇటీవల జరిగిన జీపీడీపీ వర్క్‌షాప్‌లో పాల్గొని మండలానికి తిరిగి వచ్చిన బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్‌ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నతోపాటు పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు సన్మానించారు. బోథ్‌లో సర్పంచులు, ఎంపీటీసీలు శాలువాతో సత్కరించారు.

కౌన్సిలర్‌కు పరామర్శ

కైలాస్‌నగర్: తిర్పెల్లి వార్డు కౌన్సిలర్ సాయి ప్రణయ్ బైక్ ప్రమాదంలో గాయపడి మంగళవారం రిమ్స్‌లో చేరారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ రిమ్స్‌కు చేరుకుని ఆయన్ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు.

బ్యాగులు పంపిణీ

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ జెడ్పీసెకండరి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యాదశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ నగిశెట్టి బాబు మంగళవారం సర్టిఫికెట్ ఫైల్, స్కూల్ బ్యాగులు, డిక్షనరీలు, పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంఈవో శ్రీకాంత్, ఎస్‌ఎంసీ చైర్మన్ మహేష్, అడ్వకేట్ జీవన్ కుమార్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నార్నూర్: దివంగత డీసీసీబీ చైర్మన్ కాంబ్లె నాందేవ్ జ్ఞాపకార్థంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అన్నాభావుసాఠె కమిటీ జిల్లా అధ్యక్షుడు కాంబ్లె ఉదయ్ మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ప్రిన్సిపాల్ చిన్నప్పారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగీర్ ఉన్నారు.

బడిబాటలో విద్యార్థుల గుర్తింపు

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో సీఆర్పీలు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు మంగళవారం సీఆర్పీ సురేందర్ గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ పిల్లల వివరాలను సేకరించారు. పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

సీఐటీయూలోకి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు

ఎదులాపురం: సీఐటీయూలో ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు చేరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు గంగన్న, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గోశాలకు విరాళం

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన వెల్మ రాజేందర్‌రెడ్డి మంగళవారం జై శ్రీరాం గోశాలకు పశుగ్రాసం కోసం రూ.5 వేల నగదును విరాళంగా అందించారు. రాజేందర్ తండ్రి వెల్మ భూమారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నిర్వాహకుడు రాజేశ్‌కు ఈ నగదును అందజేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తాంసి: మండలంలోని జామిడి గ్రామానికి చెందిన ఏనుగు పద్మారెడ్డి ప్రథమ వర్ధంతిని లింగి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. కుటుంబసభ్యులు 50 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఆమె భర్త ప్రకాష్‌రెడ్డి, కుటుంబసభ్యులు, నిర్వాహకుడు విశాల్ ఉన్నారు.

12న మెగా రక్తదాన శిబిరం

కైలాస్‌నగర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డితోపాటు పలువురు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

కైలాస్‌నగర్: టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్.అశోక్, ఏ.నవీన్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు కె.చంద్రశేఖర్‌ను మంగళవారం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. స్థానిక టీఎన్జీవోస్ భవనంలో వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన బోధన చేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో టీపీయూఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆ సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షుడు రాథోడ్ ఉత్తమ్‌రావ్ మాట్లాడుతూ పీఆర్సీ కమిటి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 4 డీఏ బకాయిలను త్వరగా ప్రకటించాలని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి గోడం జ్యోతిరాం, ఉపాధ్యాయులు ప్రకాశ్ రాథోడ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

బేల: పత్తికి తగిన గిట్టుబాటు ధర కోసం ఈనెల 12న చలో కలెక్టరేట్ ఎదుట ధర్నాకు అన్ని గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని అఖిలపక్ష రైతు సంఘం జిల్లా నాయకుడు దారట్ల కిష్టు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో అఖిలపక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జస్టిస్ స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు రైతు పంటల సాగు పెట్టుబడికి అయ్యే ఖర్చుకు రెండింతలు కలిపి ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ బహిరంగ మార్కెట్‌లో కమర్షియల్ పద్ధతిలో పోటీగా కొనుగోలు చేయాలని, తద్వారా రైతులకు కొంత మేలు జరుగుతుందన్నారు. నాయకులు బండి దత్తాత్రి, విజ్జగిరి నారాయణ, గోవర్ధన్ యాదవ్, దేవిదాస్, సామ రూపేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, జైనథ్ మార్కెట్ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, నాయకులు గుండవార్ సంజయ్, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.